అక్రమ అరెస్ట్

లోకసభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను మానసికంగా దెబ్బతీయాలనే రాజకీయ కుట్రతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయంలో అరెస్టు చేయడం పూర్తిగా అప్రజాస్వామిక చర్య. కవిత అరెస్టుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలి.

-కడియం శ్రీహరి, మాజీ డిప్యూటీ సీఎం

భగ్గుమన్న మహిళాలోకం

మోదీకి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు

ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అరెస్ట్‌పై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాత్రి ఆమె అరెస్ట్ వార్త తెలియగానే పార్టీ శ్రేణులతోపాటు మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోదీ డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేసి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. భువనగిరి పట్టణంలో ప్రిన్స్ కార్నర్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేశారు. కవిత అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. విచారణ జరుగుతున్న సమయంలో ఎలా అరెస్ట్ చేస్తారంటూ మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్‌రోడ్‌లో రాస్తారోకో చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటినీ కేంద్రం దుర్వినియోగం చేస్తున్నదని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. దేవరకొండలో రాస్తారోకో నిర్వహించారు. జగిత్యాలలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టగా, మెట్‌పల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా, నిరసనలో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం ఎన్టీఆర్ చౌరస్తా, జనగామ జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు.

మోదీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- బీజేపీ కుట్ర.. కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, మార్చి15 (నమస్తే తెలంగాణ)/నాగర్‌కర్నూల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమమని, ముమ్మాటికీ ఇది అప్రజాస్వామికమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఇది బీజేపీ కుట్రలో భాగమని, కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందంతో ఆమెను అరెస్టు చేసిందని విమర్శించారు. కవిత అరెస్టును బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈడీనీ అడ్డు పెట్టుకొని కవితను అరెస్టు చేసిందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ కుటిల ఎత్తుగడలకు తలొగ్గకుండా, బీఎస్పీతో చేతులు కలిపిన కొన్నిగంటల్లోనే మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరతీశాడని ధ్వజమెత్తారు. ఈ చర్య తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దెబ్బకొట్టడం తప్ప మరొకటి కాదని తెలిపారు. దేశంలో మోదీ పాలన నాజీల నియంతృత్వంకన్నా ఘోరంగా ఉన్నదని ధ్వజమెత్తారు. ప్రొఫెసర్ సాయిబాబా, సిసోడియా, ఇటీవల హేమంత్ సోరెన్, నేడు కల్వకుంట్ల కవిత, రేపు నువ్వో నేనో? అని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం కాదు.. యావత్తు దేశం బీజేపీని తక్షణమే తిరస్కరించాల్సిన అవసరమున్నదని కోరారు.

బడేభాయ్.. చోటేభాయ్..

రాజ్యాంగం ఇచ్చిన హక్కులన్నీ ప్రమాదంలో ఉన్నాయని ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బడేభాయ్.. చోటేభాయ్‌లా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన కాన్షీరాం 90వ జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో కేంద్రం దేశాన్ని పూర్తిగా దోచుకున్నదని, ఆస్తులను, సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టిందని ధ్వజమెత్తారు. బీజేపీ పాలనను ప్రశ్నించే వారిపై ఏసీబీ, ఈడీ దాడులు అంటూ వారి నోళ్లను మూయిస్తున్నారని మండిపడ్డారు.

మోదీ వెంటే ఈడీ!

ప్రధాని పర్యటనల సమయంలోనే దాడులు

- బీజేపీయేతర రాష్ట్రాల్లో ఎప్పుడూ ఇదే తంతు
- ఇప్పుడు మల్కాజిగిరిలో మోదీ రోడ్ షో జరుగుతుండగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి విడదీయలేని బంధం ఉన్నది. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో మోదీ పర్యటిస్తున్నారంటే.. ఆయన వచ్చే ముందో, ఆ తర్వాతో కచ్చితంగా ఆ రాష్ట్రంలో ఐటీ, ఈడీ, సీబీఐ లాంటి జాతీయ దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం, ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీ నేతలను లేదా బీజేపీని విమర్శిస్తున్న నేతలను, వారికి అండగా నిలుస్తున్న సంస్థలపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఇప్పుడు తెలంగాణలో జరిగింది కూడా ఇదే. మల్కాజిగిరి నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించేందుకు మోదీ శుక్రవారం తెలంగాణకు రాకముందే ఈడీ అధికారులు వాలిపోయారు. ఆ రోడ్‌షో ముగిసేలోగా కవితను అరెస్ట్ చేశారు. బీజేపీయేతర రాష్ట్రాలన్నింటిలోనూ ఇదే తంతు కొనసాగుతున్నది. మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటనల సమయంలోనూ కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం సర్వసాధారణంగా మారింది.

- 2022 ఫిబ్రవరి 5న హైదరాబాద్‌లో రామానుజాచార్యుల విగ్రహావిష్కరణకు మోదీ వచ్చారు. మరుసటి రోజే తెలంగాణ, ఏపీలోని దాదాపు 40 ప్రాంతాల్లో ఐటీ దాడులు జరిగాయి. రియల్‌ఎస్టేట్ సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి.
- అదే ఏడాది జూలై 1 నుంచి 3 వరకు జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో మోదీ పాల్గొన్నారు. 3న బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావుకు చెందిన దాదాపు రూ.88 కోట్ల ఆస్తులను ఐటీ శాఖ జప్తు చేసింది.
- 2022 నవంబర్ 12న మోదీ రామగుండానికి వచ్చారు. అంతకుముందే.. 9వ తేదీన అప్పటి మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇండ్లపై ఈడీ దాడులు చేసింది. లిక్కర్ స్కాం పేరుతో అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డిని అరెస్ట్ చేసింది.
- 2023 మార్చి 11న అమిత్‌షా తెలంగాణ పర్యటనకు వచ్చారు. అదేరోజు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ విచారించింది.
- ఏప్రిల్ 8న మోదీ తెలంగాణలో పర్యటించారు. అదే నెల 2న రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఈడీ సోదాలు చేసింది.
- జూన్ 14న అమిత్ షా రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. అదేరోజు ఐటీశాఖ రంగంలోకి దిగింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సంస్థలు, వాటి కార్యాలయాలయాలపై దాడులు చేసింది
- ఆగస్టు 6న మోదీ హైదరాబాద్‌కు వచ్చారు. అదే నెల 1న నగరంలో ఈడీ సోదాలు జరిగాయి.
- అక్టోబర్ మొదటి వారంలో మోదీ తెలంగాణలో పర్యటించారు. అదే సమయంలో ఈడీ డ్రగ్స్ కేసులో సినీ నటులను విచారించింది.

విడుదల చేయకపోతే ఆమరణదీక్ష

- ఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను తెలంగాణ సమాజం మీద జరిగిన దాడిగానే భావిస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డ, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కవితను విడుదల చేయకపోతే ఆమరణదీక్ష చేపడతానని హెచ్చరించారు.

సీఎం పోస్టు ఆఫర్!

- ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియాకు సీబీఐ వల
- బీజేపీ కుట్రను అప్పుడే బయటపెట్టిన సిసోడియా
- అందుకే, ఏడాది గడిచినా ఇంకా జైల్లోనే..!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఆయన పేరు మనీశ్ సిసోడియా. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి. కేజ్రీవాల్ తర్వాత ఆమ్‌ఆద్మీ పార్టీలో రెండో కీలక నేత. ఢిల్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బస్తీ దవాఖానలు, సర్కారు బడుల్లో నాణ్యత ప్రమాణాల పెంపు, ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం వంటి నిర్ణయాల్లో సిసోడియాది ప్రధాన పాత్ర. నూతన మద్యం పాలసీలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సిసోడియాను పలుమార్లు విచారించిన సీబీఐ.. 2023, ఫిబ్రవరి 26న అరెస్టు చేసింది. అప్పటినుంచి ఆయన జైలు జీవితాన్నే గడుపుతున్నారు. విచారణ సమయంలో సీఎం పదవిని ఆశజూపి ఆప్‌ను లొంగదీసుకొనేందుకు బీజేపీ కుట్రకు తెర తీసిందని అరెస్టుకు ముందు సిసోడియా ఆరోపించారు. ఆప్‌ను వీడాలని సీబీఐ అధికారులు తనపై ఒత్తిడి చేశారని 2022 అక్టోబర్ 17న సిసోడియా తెలిపారు. బీజేపీలోకి వస్తే, ఢిల్లీ సీఎం పోస్టు ఇస్తామని ఆఫర్ చేశారని, లేకుంటే జైలుకు పంపిస్తామని బెదిరించారని పేర్కొన్నారు. ఏడాదికి పైగా జైలు జీవితాన్ని అనుభవిస్తున్నా, బీజేపీ బెదిరింపులకు వెరవకుండా సిసోడియా కోర్టుల్లో తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

శుక్రవారం తన అరెస్ట్ సందర్భంగా పోరాట చిహ్నం పిడికిలి బిగించి పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఆమె కుమారుడు

జోడు పదవులతో కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి

- ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియామకం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి శుక్రవారం బీజేపీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ వెనువెంటనే ఆయనను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జంట పదవులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో జితేందర్‌రెడ్డితోపాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్‌ను మాజీ మంత్రి డీకే అరుణకు కేటాయించిన నేపథ్యంలో ఆయన ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి గురువారం జితేందర్‌రెడ్డి ఇంటికి స్వయంగా వెళ్లి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడంతో ఆయనకు మల్కాజిగిరి టికెట్ ఇస్తారని భావించారు. అయితే జితేందర్‌రెడ్డికి రెండు నామినేటెడ్ పదవులు ఇవ్వడంతో ఎంపీ టికెట్ ఇవ్వరని తేలిపోయింది. నామినేటెడ్ పోస్టుల ఉత్తర్వులు అందుకున్నాకే జితేందర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్టు తెలిసింది. బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేసిన జితేందర్‌రెడ్డి ఆ లేఖను పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పంపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో పార్టీ రాష్ట్రం నలుమూలలకు విస్తరించిందని, అయితే బండిని అకస్మాత్తుగా మార్చడం వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోయిందని పేర్కొన్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో 25 సీట్లు వస్తాయనుకుంటే ఎనిమిది సీట్లకే పరిమితమైందని వివరించారు.

నాగర్‌కర్నూల్ బరిలో బహుజన మేధావి

- బీఆర్ఎస్-బీఎస్పీ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్
- కాంగ్రెస్ అభ్యర్థి ఖరారులో లొల్లి
- బీజేపీలోనూ అంతర్గత విభేదాలు
- ఆర్ఎస్పీకి కలిసిరానున్న సమీకరణాలు
- ఏకమవుతున్న దళిత, బహుజనులు, మేధావులు
- బీఆర్ఎస్, బీఎస్పీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

నాగర్‌కర్నూల్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన మేధావి బరిలో నిలిచారు. బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తులో భాగంగా తాను పోటీ చేస్తున్నట్టు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాగర్‌కర్నూల్‌లో ప్రకటించారు. దళిత, బహుజన మేధావి, ఐపీఎస్, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన అదనపు డీజీపీ, స్వేరో వ్యవస్థాపకుడు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహకారంతో నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేయబోతున్నారు. బీఎస్పీతోపాటు గులాబీ శ్రేణుల్లో, స్వేరో, దళిత, బహుజనుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ఎస్పీ పోటీతో ఆయా శ్రేణుల్లో గెలుపు లెక్కపై కాకుండా మెజార్టీ అంచనాలు వేసుకొంటుండటం విశేషం.

నాగర్‌కర్నూల్ బరిలో ఆర్ఎస్పీ

ఇటీవల జరిగిన బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తుల చర్చల్లో హైదరాబాద్‌తోపాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలను బీఎస్పీకి కేటాయించారు. దీంతో నాగర్‌కర్నూల్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బరిలో నిలుస్తున్నారు. పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన ఆయన మంచి పేరు సంపాదించారు. అనంతరం గురుకులాల సమన్వయకర్తగా బహుజన విద్యార్థులను జాతీయ స్థాయికి ఎదిగేలా చేశారు. దళిత బహుజనులతో స్వేరో సంస్థను ఏర్పాటు చేసి ఉపాధితోపాటు ఆత్మగౌరవం పొందుతూ సంఘటితంగా పోరాడే శక్తిని కల్పించారు. ఇలా విద్యా, ఉద్యోగ రంగాల్లో సమాజ అభ్యున్నతికి, ముఖ్యంగా దళిత, బహుజనుల సంక్షేమానికి పాటుపడుతూ వచ్చిన ఆయన రాజకీయాల్లో రాజ్యాధికార లక్ష్యంతోనే అంతిమ లక్ష్యం సిద్ధిస్తుందని బీఎస్పీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగా పోటీచేయగా మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బడుగుల కోసం బీఆర్ఎస్‌తో కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. బలమైన నేత ఆర్ఎస్ ప్రవీణ్ పోటీ చేస్తుండటం ఆయా వర్గాల్లో జోష్ నెలకొన్నది.

కాంగ్రెస్, బీజేపీకి షాక్..!

ఆర్ఎస్పీ పోటీలో నిలబడటంతో కాంగ్రెస్, బీజేపీ, ఆయా పార్టీల అభ్యర్థులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కాంగ్రెస్‌లో అభ్యర్థి ఖరారులో డైలమా నెలకొన్నది. మల్లురవి, సంపత్ కుమార్ మధ్య తీవ్ర పోటీతో పార్టీ అధిష్ఠానం తలలు పట్టుకొన్నది. ఎవరికి వారే తమకే కాంగ్రెస్ టికెట్ వస్తుందని చెప్పుకుంటూ వేర్వేరుగా పర్యటిస్తున్నారు. ఇది కాంగ్రెస్ శ్రేణులను గందరగోళానికి గురిచేస్తున్నది. ఇక బీజేపీలోనూ అభ్యర్థిగా భరత్ పేరు ఖరారైనా అంతర్గత విభేదాలు నెలకొన్నాయి. ఇప్పటివరకు టికెట్ ఆశించి భంగపడ్డ బంగారు శృతితో సఖ్యత లేదు. ఇప్పటికే ఉన్న బీజేపీ నేతలతోనూ భరత్, ఆయన వర్గీయులు కలవలేక పోతున్నారు. బయటి నుంచి వచ్చి టికెట్ తీసుకున్న నేతకు తాము ఎలా పని చేస్తామని సైద్ధాంతిక మూలాలున్న కమలం నేతలు లోలోన మదనపడుతున్నారు. ఇలా కాంగ్రెస్, బీజేపీల్లోని పంచాయితీ.. బీఆర్ఎస్-బీఎస్పీ కూటమికి కలిసిరానున్నది.

దళిత, బహుజన మేధావికి కేసీఆర్ మద్దతు

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని జోగుళాంబ గద్వాల, అలంపూర్‌లో బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పటికీ పార్టీలో మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బలంగా ఉన్నారు. ఇది ఆర్ఎస్ ప్రవీణ్‌కు కొండంత అండగా నిలవనున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాటను జవదాటని క్యాడర్ పార్టీకి పెట్టని ఆస్తి. దళిత, బహుజన వర్గాలు, మేధావులు, పలు కుల సంఘాలు, స్వేరోలు ఆర్ఎస్పీ కోసం ఏకమవుతున్నాయి. ఇప్పటికే ఆర్ఎస్పీని కలిసి తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించాయి. ఇది బీఆర్ఎస్-బీఎస్పీ కూటమి గెలుపునకు తొలి మెట్టు కానున్నది. ఆర్ఎస్పీ పేరు ఖరారు కాగానే గెలుపు ఖాయమనే ప్రచారం జరుగుతున్నది. తేలాల్సింది మెజార్టీ లెక్కేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదం, ఆ పార్టీ నాయకుల మద్దతుతో, గులాబీ శ్రేణుల అండతో బహుజన మేధావి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం లాంఛనమేనని రాజకీయ మేధావులు విశ్లేషిస్తున్నారు.

టీజీ నెంబర్ ప్లేట్ బిడ్డింగ్‌కు వినియోగదారుల ఆసక్తి

తొలిరోజున రవాణాశాఖకు 2.51 కోట్ల ఆదాయం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన టీజీ నెంబర్ ప్లేట్ల బిడ్డింగ్ ప్రారంభం రోజున రవాణాశాఖ ఖాతాలో రూ.2 కోట్ల 51 లక్షల ఆదాయం వచ్చిపడింది. టీఎస్ స్థానంలో టీజీ ప్రారంభించడంతో నెంబర్లు మొదటి నుంచి ప్రారంభించారు. దీంతో తొలి నెంబర్లను దక్కించుకోవడానికి వాహనదారులు పోటీపడ్డారు. తమకు నచ్చిన నెంబర్ కోసం లక్షలు వెచ్చించి కైవసం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాన్సీ నెంబర్ల బిడ్డింగ్‌తో రూ.2 కోట్ల 51 లక్షల 86 వేల ఆదాయం సమకూరింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో రూ.కోటీ 32 లక్షల 75 వేల ఆదాయం వచ్చింది. అత్యధికంగా ఖైరతాబాద్‌లో టీజీ 09 0001 నెంబర్‌ను రూ.9 లక్షలకు రుద్రరాజు అనే వ్యక్తి కైవసం చేసుకున్నారు. ఎక్కువగా 0001, 0002, 0003, 4, 5, 6, 7, 8, 9 నెంబర్లను బిడ్డింగ్‌లో కైవసం చేసుకోవడానికి ఆసక్తి చూపారు.

ఏపీ ఉద్యోగులకు రెండు డీఏలు

- ఉత్తర్వులు జారీ చేయనున్న ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు రెండు డీఏలను ప్రకటించనున్నది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నది. ఏప్రిల్ నెల జీతంతో కూడిన ఒక డీఏ, జూలై నెల జీతంతో కూడిన మరొక డీఏను ఏపీ ప్రభుత్వం ఇవ్వనున్నది.

ఎంపీ అవినాశ్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో 8వ నిందితుడు, వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బెయిల్ షరతులను ఉల్లంఘించారనే కేసులో తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ కేసులో మరో నిందితుడు, అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం విచారించారు. బెయిల్ షరతులను ఉల్లంఘించి సాక్షులను బెదిరించారని దస్తగిరి లాయర్ వాదన.

లింక్ క్లిక్ చేస్తే కోట్లు గాయబ్!

- ఏటేటా పెరుగుతున్న సైబర్ మోసాలు
- మోసపోతున్నవారిలో సీఏలు, ఇంజినీర్లు
- 2023లో 627 కేసుల్లో 4 కోట్లు స్వాహా
- ఈ 2 నెలల్లో 213 కేసుల్లో 60 కోట్లు హాంఫట్
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీస్ అధికారులు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఏటేటా డిజిటల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంలు పెరుగుతున్నా కొద్దీ మోసాలూ అదే స్థాయిలో పెరుగుతున్నాయని రాష్ట్ర సైబర్ క్రైమ్ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ వెల్లడించారు. వివిధ పద్ధతులు, పలు గ్రూపుల లింకుల ద్వారా బాధితులు కోట్లాది రూపాయలు పోగొట్టుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో జరిగిన పలు నేరాల వివరాలను విడుదల చేశారు. వివిధ డిజిటల్ వేదికలపై ముఖ్యంగా ఐపీవోతో ముందుస్తు కేటాయింపులు బాగా పెరుగుతాయని నమ్మించి పెద్ద సంఖ్యలో ప్రజలను మోసం చేస్తున్న కేసులు అనేకం నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాంటి మోసాల్లో భాగంగా నిరుడు 627 కేసులు నమోదయ్యాయని, వాటి వల్ల రూ.3.9 కోట్ల వరకు దోపిడీ జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే 213 కేసులు నమోదు కావడంతోపాటు రూ.27.4 కోట్లను ప్రజలు నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు. మోసపూరిత యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయించి ఇంటర్ ఫెయిల్ అయిన ఎందరో సైబర్ నేరగాళ్లు విద్యావంతులే టార్గెట్‌గా రూ.లక్షలాది సొమ్మును దోచుకుంటున్నారని సైబర్ సెక్యూరిటీ పోలీసులు నిర్ధారించారు.

కోట్లు కొల్లగొట్టిన మెసగాళ్లు

హైదరాబాద్ నగరంలో కూకట్‌పల్లికి చెందిన ఒక నగల వ్యాపారి 'గోల్డ్‌మెన్ సాచెస్ బిజినెస్ స్కూల్' పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో చేరారు. అందులో పెట్టుబడులు పెట్టి రూ.5.98 కోట్లు పోగొట్టుకున్నారు. న్యూబోయినపల్లికి చెందిన ఒక వ్యాపారి '82 స్ట్రాంగ్ స్టాక్స్ అకాడమీ' అనే పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో చేరారు. అక్షరాలా రూ.67.50 లక్షలు నష్టపోయారు. రాజేందర్‌నగర్‌కు చెందిన 'ఎయిర్‌టెల్ రిలయన్స్ క్లబ్', 'బీ1 కేకేఆర్‌సీఏ స్టడీయింగ్' వంటి రెండు గ్రూపుల్లో చేరిన సీఏ చదివిన ఒక ప్రైవేటు ఉద్యోగి వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింకుతో రూ.50.61 లక్షలు నష్టపోయారు. కేపీహెచ్‌బీలోని ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి స్టాక్ మార్కెట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పేరుతో వచ్చిన వాట్సాప్ గ్రూపులో చేరి రూ.1.03 కోట్లు పోగొట్టుకున్నారు.

సెబీ మార్గదర్శకాలు పాటించాలి: పోలీసులు

ప్రజలు పెట్టుబడులు పెట్టే క్రమంలో సెబీ మార్గదర్శకాలను తప్పకుండా అనుసరించాలని సైబర్ క్రైమ్ పోలీసులు కోరుతున్నారు. మోసపూరిత లింకులు వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ద్వారా వస్తున్నాయని, ఆ లింకుల ద్వారా ప్రేరేపితమైన మెసేజ్‌లను నమ్మి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో డబ్బు పోగొట్టుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

1930కి కాల్ చేయండి

ఆన్‌లైన్ పెట్టుబడులకు ముందు బాగా ఆలోచించండి. సెబీ వంటి నియంత్రణ సంస్థల జాగ్రత్తలు పాటించండి. సెబీ తదితర ప్రసిద్ధ స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి లైసెన్స్ పొందిన స్టాక్ బ్రోకర్ల ద్వారానే పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయి. ఏదైనా బ్రోకర్‌తో పనిచేసే ముందు, వారి ట్రాక్ రికార్డ్‌నూ తనిఖీ చేయాలి. డీమ్యాట్ ఖాతా తెరవకుండానే స్టాక్స్ ట్రేడ్ చేస్తే, మీరు డబ్బును కోల్పోవచ్చు. అలాగే, డీమ్యాట్ ఖాతా లేకుండా అనధికార యాప్‌లు, ఏపీకే ఫైల్స్, యాప్స్ ద్వారా వ్యాపారం చేయడం చాలా ప్రమాదకరం. మోసానికి గురయ్యామని తెలిసిన గంటలోపే 1930కి కాల్ చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి.

- శిఖాగోయెల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏడీజీ

ప్రజాశాంతి పార్టీ గుర్తును తేల్చండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీకి ఒకే గుర్తు కేటాయింపు వ్యవహారంపై తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ పార్టీ ఇచ్చిన వినతి పత్రంపై ఈసీ వారంలోగా నిర్ణయం తీసుకోవాలంది. తమ వినతిపై ఈసీ స్పందించడం లేదంటూ ఆ పార్టీ అధినేత కేఏ పాల్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జె అనిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. రింగ్, హెలికాప్టర్ గుర్తు కేటాయించాలని గత జనవరి 19, ఫిబ్రవరి 22 తేదీల్లో వినతి పత్రాలు ఇస్తే ఈసీ నిర్ణయం తీసుకోల